VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 11 సోమవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 112




తెలంగాణలో గ్రూప్-3 పరీక్షల హాల్ టికెట్లు విడుదల

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# మహారాష్ట్ర ఎన్నికలకు తెలంగాణ డబ్బు!

- ఆ పనిలోనే సీఎం రేవంత్ బిజీగా ఉన్నారు.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్
- రుణమాఫీపై మహారాష్ట్రలో రేవంత్ చెప్పినవన్నీ అబద్ధాలే
- రైతుబంధు, వరికి బోనస్, ఉద్యోగాల కల్పన వంటివన్నీ బోగస్
- రోడ్ల మీదున్న వడ్ల కుప్పలే రేవంత్ అసమర్థ పాలనకు నిదర్శనం



హైదరాబాద్: తెలంగాణ డబ్బును మహారాష్ట్రకు పంపే పనిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నారని.. కాంగ్రెస్‌కు మహారాష్ట్ర ఎన్నికల కోసం డబ్బులు రేవంతే సమకూర్చుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణలో రుణమాఫీ చేశామని, రైతు బంధు, వరికి బోనస్ ఇచ్చామంటూ మహారాష్ట్రలో సీఎం రేవంత్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని మండిపడ్డారు. రాష్ట్రంలో రోడ్ల మీద ఉన్న వడ్ల కుప్పలే రేవంత్ అసమర్థ పాలనకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర మంత్రులు రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి, గాలిమోటార్లలో రాష్ట్రాలు పట్టి తిరుగుతున్నారని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. "సీఎం రేవంత్ నోరు విప్పితే అన్నీ అబద్ధాలే. ఆ అబద్ధాల ప్రవాహాన్ని మహారాష్ట్రలో కొనసాగించారు. తెలంగాణలో మోసం చేసినట్టు అక్కడి ప్రజలనూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రెండు లక్షల ఉద్యోగాల

మిగతా 2లో




## పాలమూరుకు న్యాయం చేయడం నా బాధ్యత

- పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం గత పాలకుల నిర్లక్ష్యమే
- మేం నిధులు కేటాయిస్తే ఓర్వలేక చిల్లర రాజకీయాలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం
- కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు
- నాపై కక్ష సాధించుకోండి
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిని అడ్డుకోకండి: సీఎం రేవంత్
- రూ.110 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్,
- ఘాట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన

నాటి హైదరాబాద్ రాష్ట్రానికి బూర్గుల రామకృష్ణారావు తొలి ముఖ్యమంత్రి అయితే, మళ్లీ ఇన్నాళ్లకు పాలమూరు బిడ్డకు సీఎం అయ్యే అవకాశం దక్కిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

## మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టో విడుదల



ముంబయి:మహారాష్ట్రలో ఎన్నికల కుంపటి బాగా రగులుకుంది. ప్రధాన పార్టీలన్నీ ఎన్నికల హామీలతో హోరెత్తిస్తున్నాయి. తాజాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మహారాష్ట్ర ఎన్నికల కోసం బీజేపీ మేనిఫెస్టో విడుదల చేశారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సభలో కేంద్రమంత్రి పియూష్ గోయల్ , మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ భవాంకులే, ముంబయి బీజేపీ అధ్యక్షుడు ఆశిష్ షేలార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ మేనిఫెస్టోలో... మహారాష్ట్రలో వృద్ధుల పెన్షన్ ను రూ.2,100కు పెంచుతామని తెలిపారు. మహారాష్ట్రలో యువతకు 25 లక్షల ఉద్యోగాలు ఇస్తామని పేర్కొన్నారు. మహారాష్ట్రలో స్కిల్ సెన్సస్ చేపడతామని అమిత్ షా వెల్లడించారు. మహిళల లఖ్ పతి దీదీ పథకాన్ని మరింత విస్తరిస్తామని చెప్పారు. ఎరువులపై రైతులు చెల్లించే జీఎస్టీని తిరిగి ఇచ్చేస్తామని, తద్వారా ఆర్థికభారం తగ్గిస్తామని వివరించారు. మహారాష్ట్రలో పరిశ్రమల అభివృద్ధికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. రూ.25 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంటామని అమిత్ షా వివరించారు. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు, నవంబరు 20న ఒకే విడతలో ఎన్నికలు జరపనున్నారు. నవంబరు 23న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

**నవంబరు 20న మహారాష్ట్రలో ఎన్నికలు**
**హామీలతో హోరెత్తిస్తున్న ప్రధాన పార్టీలు**
**వృద్ధుల పెన్షన్ రూ.2,100కి పెంచుతామని బీజేపీ హామీ**
**యువతకు 25 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అమిత్ షా వెల్లడి**
**రూ.25 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు**

## బీసీ డిక్లరేషన్ హామీలు ఎటు పోయాయి?



హన్మకొండ: బీసీ డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయి?ఎటు పోయాయి? అంటూ కాంగ్రెస్ సర్కార్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. ఆదివారం ఆయన హన్మకొండలో మాట్లాడుతూ.. ఏడాది కింద ఇదే రోజు కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. బీసీ డిక్లరేషన్ పేరిట చాలా వాగ్దానాలు ఇచ్చారు. కొత్తవి అమలు చేయడం దేవుడెరుగు ఉన్న పథకాలు తీసేసింది." అని మండిపడ్డారు."కాంగ్రెస్ పార్టీ బీసీలకు వెన్నుపోటు పొడిచింది. బీసీ బంధుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాతర వేసింది. కుల గణన కోసం ఇళ్లకు వెళ్తున్న అధికారులను ప్రజలు నిలదీస్తున్నారు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని అడుగుతుంటే అధికారులు నీళ్లు నములుతున్నారు. అడ్డమైనా హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు పెట్టాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు."కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలను ఇబ్బందులకు గురిచేస్తోంది. బీసీ ఓట్ల కోసం.. కులగణనతో కాంగ్రెస్ కొత్త నాటకానికి తెరతీసింది. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా కాంగ్రెస్ నెరవేర్చలేదు. బీసీ డిక్లరేషన్‌తో కాంగ్రెస్ వెన్నుపోటు పొడుస్తుంది. మహారాష్ట్రలో సీఎం రేవంత్ తెలంగాణకు 500 బోనస్ ఇచ్చామంటూ బోగస్ మాటలు మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాడదాం" అని కేటీఆర్ చెప్పారు.

## జారండ్‌లో అవినీతిపరులను బీజేపీ విడిచిపెట్టదు



రాంచీ: జారండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపణలు చేశారు. జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం హేమంత్ సోరెన్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. జారండ్‌లో అక్రమ మైనింగ్ స్కామ్ పేరుతో జార?ండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ప్రజలను దోచుకున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో పెద్ద మొత్తంలో డబ్బు రికవరీ చేశారని గుర్తుచేశారు. ఆదివారం జారండ్‌లోని బొకారోలో నిర్వహించిన ర్యాలీలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు."సీఎం హేమంత్ సోరెన్ ప్రభుత్వం జార?ండ్‌ను దోచుకుంది. మేము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఈ అవినీతిపరులను కఠినంగా శిక్షించేలా న్యాయస్థానంలో పోరాడతామని హామీ ఇస్తున్నా. న్యాయంగా మీకు (ప్రజలు) చెందిన డబ్బు మీ ప్రయోజనాలు, భవిష్యత్తు కోసం ఉపయోగించబడుతుంది. మీ పిల్లల భవిష్యత్తు గురించి వినియోగిస్తాం" అని అన్నారు.



## హిందూ సంస్కృతి గొప్పది

రెంజల్: హిందూ సంస్కృతి ఎంతో గొప్పదని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తిలో ఆరెస్సెస్ ఆధ్వర్యంలో రూ.45 కోట్లతో చేపట్టిన ఆరెస్సెస్ వ్యవస్థాపకుడు డా.కేశవ్ బలిరాం హెడ్గేవార్ స్మృతి మందిర నిర్మాణ పనులను ఆదివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అంతకుముందు కార్తికమాసం సందర్భంగా గోదావరికి గంగాహారతి ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. సంస్కారానికి ప్రతీకగా ఆరెస్సెస్ నిలుస్తోందని, సంస్కారం ఉన్నపుడే వ్యక్తిలో వ్యక్తిత్వం, నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా డా.హెడ్గేవార్ పూర్వీకుల గ్రామమైన కందకుర్తిలో హెడ్గేవార్ స్మృతి మందిర నిర్మాణంతో పాటు కేశవ శిశుమందిర నిర్మాణాలు చేపట్టడం సంస్కారానికి గుర్తింపుగా నిలుస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కందకుర్తిని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను వివిధ సంఘాల ప్రతినిధులు సన్మానించారు.




# తెలంగాణలో గ్రూప్-3 పరీక్షల హాల్ టికెట్లు విడుదల

హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 పరీక్ష జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 పరీక్ష ఉండనుంది. ఈ పోస్టులకు 5.36 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు.

ఉదయం జరిగే పరీక్షలకు 9.30 తర్వాత, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.30 అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని ఇటీవల టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ కాపీని భద్రంగా పెట్టుకోవాలని, తొలిరోజు పేపర్-1 పరీక్షకు హాజరైన హాల్‌టికెట్‌ను మిగతా పరీక్షలకు ఉపయోగించాలని పేర్కొంది. ప్రశ్నపత్రాలు, హాల్‌టికెట్లను నియామక ప్రక్రియ ముగిసేవరకు భద్రంగా పెట్టుకోవాలని సూచించింది.




# మహారాష్ట్ర ఎన్నికలకు తెలంగాణ డబ్బు!




కల్పనపై మహారాష్ట్రలో పచ్చి అబద్ధాలు చెప్పారు. విద్యార్థులను వీపులు పగలకొట్టించిన చరిత్ర కాంగ్రెస్ సర్కార్‌దే. తెలంగాణలో 40 లక్షల మందికి రుణమాఫీ చేశామని రేవంత్ అవాస్తవాలు చెప్పారు. 2023 డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పారు. 42 లక్షల మందికి రూ.31 వేలకోట్లు రుణమాఫీ చేస్తామని రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారు. అది కూడా 7 నెలలు ఆలస్యం చేసి రైతులపై వడ్డీల భారం మోపారు. ఇంకా 22 లక్షల మంది రైతుల రుణాలు మాఫీ చేయాల్సి ఉంది. తెలంగాణలో పోలీసు కానిస్టేబుళ్లు రోడ్ల మీదికి వచ్చే పరిస్థితి నెలకొంది. హాస్టళ్లలో విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు.

గ్యారంటీలు గ్యారేజ్‌కు పోయాయి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు ఏడాది పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారంటీలు గెలిచాక గ్యారేజీకి పోయాయి. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ ఇచ్చారు. ఏ హామీలు అమలు చేశారో, ఎక్కడ చర్చిద్దామో చెప్పండి. బహిరంగ చర్చకు నేను సిద్ధం.

మహిళలకు అభయ హస్తం ఏదీ?

మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామని అభయ హస్తంలో చెప్పిన మొదటి హామీకే దిక్కులేదు. మహారాష్ట్రలో మాత్రం కోతలు కోస్తున్నారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం ఒక్కో మహిళకు రూ.27,500 బాకీ ఉంది. రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు, రైతుకూలీలకు రూ.12 వేలు, వరికి రూ.500 బోనస్ వంటి ఎన్నో హామీలిచ్చారు. ఒక్కటి కూడా అమలు చేయలేదు. హామీలను ఎగవేయటమే కాంగ్రెస్ నైజంగా మారింది. సోనియమ్మ మాట.. రాహుల్ గాంధీ మాట అంటూ కాంగ్రెస్ నాయకులు హామీలిచ్చారు. ఇప్పుడా గాంధీలు ఎక్కడికి పోయారో తెలియదు.

రైతుల ధాన్యం కొనేదెవరు?

రాష్ట్రంలో మద్దతు ధరకు వరి ధాన్యం కొనకపోవటంతో రైతులు నష్టపోతున్నారు. క్వింటాల్ వడ్లు రూ.1,900కే వడ్లు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనకు రోడ్లపై వరికుప్పలే సాక్ష్యం. పైగా బోనస్ ఇచ్చామంటూ మహారాష్ట్రలో బోగస్ మాటలు మాట్లాడారు. అన్ని వర్గాలను మోసం చేసిన వ్యక్తి రేవంత్. జీవో 29 పేరుతో

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేశారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మాటతప్పారు. ప్రశ్నించిన నిరుద్యోగులను పోలీసులతో అణచివేసే ప్రయత్నం చేశారు. ఉద్యోగాల భర్తీలో వైఫల్యంపై మహారాష్ట్రలో ఎందుకు మాట్లాడలేదు. పైగా కేసీఆర్ ఇచ్చినా ఉద్యోగాలను తాను ఇచ్చినట్టు రేవంత్ చెప్పుకోవడం సిగ్గుచేటు.."అని హరీశ్‌రావు మండిపడ్డారు.

# పాలమూరుకు న్యాయం చేయడం నా బాధ్యత

మహబూబ్‌నగర్: నాటి హైదరాబాద్ రాష్ట్రానికి బూర్గుల రామకృష్ణారావు తొలి ముఖ్యమంత్రి అయితే, మళ్లీ ఇన్నాళ్లకు పాలమూరు బిడ్డకు సీఎం అయ్యే అవకాశం దక్కిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి, ప్రత్యేక రాష్ట్రంలో తీవ్ర అన్యాయానికి గురైన ఉమ్మడి పాలమూరు జిల్లాను అభివృద్ధి చేయడం తన బాధ్యతని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రంలోనూ జిల్లా వలసలకు చిరునామాగానే ఉందని, ఇక్కడి బిడ్డల స్వేదంతోనే దేశంలో ప్రాజెక్టులన్నీ నిర్మించారని చెప్పారు. కృష్ణమ్మ ప్రవహిస్తున్న పాలమూరులో వలసలు ఉండటం, ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం గత పాలకుల నిర్లక్ష్యమేనని మండిపడ్డారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామ శివారులో కొనసాగుతున్న కురుమూర్తిస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో సీఎం రేవంత్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. రూ.110 కోట్లతో దేవస్థానానికి నిర్మించే ఘాట్‌రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "పాలమూరులో ప్రాజెక్టులను పూర్తిచేస్తానని కురుమూర్తి స్వామి సాక్షిగా చెబుతున్నాను. 2009లో కేసీఆర్ కరీంనగర్ నుంచి పాలమూరుకు వలస వస్తే.. జిల్లా బాగుపడుతుందని ప్రజలు అక్కున చేర్చుకుని ఆశీర్వదించి పార్లమెంటుకు పంపారు. రాష్ట్రం వచ్చాక కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా ఆయన జిల్లాకు పరిశ్రమలు తీసుకురాలేదు. పెండింగ్‌లో ఉన్న జూరాల, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు పూర్తిచేయలేదు. పాలమూరులో వలసలు ఆపేందుకు సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయిస్తుంటే కొందరు కళ్లలో నిప్పులు పోసుకుంటూ.. చిల్లర మల్లర రాజకీయాలకు తెరలేపాలని చూస్తున్నారు. గత పదేళ్ల పాలనలో మీ సొంత ప్రాంతాలకు నీళ్లు తీసుకెళ్లినా.. నిధులు కేటాయించినా మేం బాధపడలేదు. రాజకీయ కక్షలు ఉంటే మరోరకంగా చూసుకోవాలి. ఇక్కడి ప్రాజెక్టుల పనులు, అభివృద్ధిని అడ్డుకుంటే పాలమూరు ప్రజలు, చరిత్ర క్షమించదు. త్వరలో ఎత్తయిన ప్రాంతమైన మక్తల్, నారాయణపేట్, కొడంగల్ నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది.



# మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బీజేపీ కార్పొరేటర్లు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 10**

మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన దిలీప్ కుమార్ ను భారతీయ జనతాపార్టీ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, పార్టీ కార్పొరేటర్లతో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ కు వారు శుభాకాంక్షలు తెలిపారు. తమ డివిజన్ ల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ కు వివరించారు. ప్రతి డివిజన్ కు రూ.25లక్షల చొప్పున నిధులు కేటాయించాలని, తాత్కాలికంగా 25చొప్పున వీధి దీపాలు అందజేయాలని, కౌన్సిల్ సమావేశాన్ని త్వరగా నిర్వహించాలని కోరారు. స్రవంతి రెడ్డి వెంట డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు, కార్పొరేటర్ పంచ రెడ్డి ప్రవళిక, భాజపా నాయకులు ఇప్పకాయల కిషోర్, పంచ రెడ్డి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# భరతమాతను జగద్గురు స్థానంలో నిలబెట్టడమే లక్ష్యం.






**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 10:**

భరతమాతను జగద్గురు స్థానంలో నిలబెట్టడమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధాన లక్ష్యమని సహ ప్రాంత ప్రచారక్ ప్రభు కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం నగర పథ సంచాలక్ అనంతరం ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో విద్యార్థి శిబిర సార్వజనికోత్సవం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభు కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచానికి జ్ఞానం, సంస్కృతి ఇచ్చిన భారతదేశ కోసం ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు. హిందువుల సంఘటితం కోసం నిర్విరామంగా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఇప్పటికే ఆర్ఎస్ఎస్ గురించి చర్చ మొదలైందని, ఎటువంటి లాభాపేక్ష లేకుండా కోట్ల మందిని ఎలా సంపాదించారో రీసెర్చ్ జరుగుతుందన్నారు. 1925కు ముందు హిందూ పదం అనాలంటేనే ఆలోచించేవారని, ప్రస్తుతం మార్పు వచ్చిందని గుర్తు చేశారు. సమాజంలో కొందరు మనతో స్నేహం చేస్తూనే స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తుల పేర్లతో హిందువుల ఐక్యాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర పన్నుతున్నారన్నారు. ప్రధానంగా లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, పాపులేషన్ జిహాద్ పేర్లతో హిందువులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మతమార్పిడుల కోసం మరో వర్గం పనిచేస్తుందన్నారు. అనంతరం రిటైర్డ్ రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ గజవాడ హనుమంతరావు మాట్లాడారు. అంతకుముందు కాషాయ ధ్వజారోహణ ప్రక్రియ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కళాశాల శిబిర సర్వాధికారి గజానన్, విభాగ్ సంఘచాలక్ ప్రతాప్, నగర ప్రచారక్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

విద్యార్థులు ప్రదర్శించిన దండ ప్రదర్శన, ఘోష్ ప్రదర్శన, యోగాసనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కవాతులో ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తాతో పాటు పలువురు ప్రముఖులు స్వయంసేవకులు పాల్గొన్నారు.

**ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ ప్రభు కుమార్. నగరంలో ఆకట్టుకున్న అర్ఎస్ఎస్ ప్రదర్శన.**

# శాస్త్రీయ విద్యా విధానం పాఠ్యంశాల్లో చేర్చాలి.

## - టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్.

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్, నవంబర్ 10**

సాంకేతిక ఫలితాలు విద్యార్థులకు అందించే విధంగా శాస్త్రీయ విద్యా విధానం పాఠ్యంశాల్లో చేర్చాలని టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ అన్నారు. టిపిటిఎఫ్ హైదరాబాద్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం ఆదివారం ప్రభుత్వ (ఆలియా) బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి పి. వెంకటేశ్వర ప్రసాద్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ హాజరయ్యారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టగా, హాజరైన కౌన్సిల్ సభ్యులందరూ ఆమోదించారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను ఖండించారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలో కనీసమైన మౌలిక వసతులు కల్పించకుండా, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించకుండా, విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించకుండా, ఇంటిగ్రేటెడ్ కాంప్రహెన్సివ్ రెసిడెన్షియల్ పాఠశాలల పేరుతో కొత్త పాఠశాలను నిర్మిస్తామని, స్కిల్ యూనివర్సిటీ పెడదామని

చెప్తున్నదని అన్నారు.

ఇప్పటికే స్థాపించబడిన కులానికో గురుకులం సంప్రదాయ పాఠశాలల అస్తిత్వాన్ని మసకబారేలా చేస్తుంటే, ఇంటిగ్రేటెడ్ కాంప్రహెన్సివ్ రెసిడెన్షియల్ పాఠశాలల పేరుతో ఏర్పాటుచేస్తే కొత్త పాఠశాలలకు విద్యార్థులు ఎక్కడి నుండి వస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా దశాబ్ద కాలం క్రితం నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలులోకి వచ్చిన సందర్భంగా దాన్ని పునః పరిశీలించాల్సిన సందర్భం వచ్చిందని, గత పదిహేను ఏళ్ళుగా సామాజిక, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అనేక కొత్త పుంతలు తొక్కుతూ ప్రపంచ దేశాలు విశ్వ విజ్ఞానం కోసం పోటీ పడుతుంటే మనం మాత్రం పాతబడ్డ పాఠ్య ప్రణాళికను అనుసరిస్తూ పుస్తకాలను నవీకరించకుండా కొనసాగించడం సరికాదని వెంట వెంటనే కొత్త ప్రభుత్వం బాధ్యతగా పాఠ్యప్రణాళికలను ఆధునీకరిస్తూ, పాఠ్యపుస్తకాలని ప్రవేశపెట్టాలని అభిప్రాయపడ్డారు. కొత్త ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా బకాయిపడ్డ డిఎలను వెంటనే చెల్లించాలని, కొత్త పిఆర్సి నివేదిక తెప్పించుకుని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల డిమాండ్ మేరకు అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆర్థిక బిల్లులు అన్నిటిని బకాయి పడ్డ సొమ్ముతో సంబంధం లేకుండా క్రమ పద్ధతిలో మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వెంకటేశ్వర ప్రసాద్, బి.రాంబాబు మాట్లాడుతూ,

అద్దె భవనాలున్న ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఉచిత విద్యుత్తు వసతి కల్పించాలని, పాఠశాలలకు అవసరమైన నిధులు విద్యార్థుల సంఖ్య కు అనుగుణంగా మంజూరు చేసి, పాఠశాలల నిర్వహణను మెరుగుపర్చే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.




నూతన కమిటీ ఎన్నిక.

టిపిటిఎఫ్ హైదరాబాద్ జిల్లా నూతన కమిటీ అధ్యక్షులుగా పి. వెంకటేశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బి రాంబాబు, ఉపాధ్యక్షులుగా ఎం. సురేందర్, కే. సీతారామ శాస్త్రి, ఎం.వెంకటేశ్వర్ రెడ్డి, వి.కామేశ్వరి, కే.గీత, శివానంద్, జగదీశ్వర్ కార్యదర్శులుగా ఎం.సోమిరెడ్డి, అందేకర్ రవి , జి సురేష్, కే ఎస్ అన్నపూర్ణ, శ్రీమతి ఏ వెంకటరమణ, జే.వెంకటేష్ , అర్షియా ఫర్హత్, ఎన్ సంజీవ్ కుమార్ మరియు రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎస్. రామానందయ్య, ఎం. వెంకటరమణ మరియు ఏ రమణ రావు లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాష్ట్ర ఎన్నికల అధికారిగా హాజరైన ముత్యాల రవీందర్ ప్రకటించారు.

